కోటి విద్యలు...

—సర్వజిత్

గూడూరు బస్ స్టాండ్ నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు బయల్దేరింది. బస్సు ఏమంత రద్దీగా లేదు. ఎలా లేదన్నా ఇంకా రెండుగంటల పైచిలుకు మద్రాసు ప్రయాణం.

మధ్యాహ్నం మూడు గంటలు దాటుతోంది. బస్సులో చాలా మంది నిద్రతో జోగుతున్నారు. కొంత మంది మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతాన తెరుస్తూ బేగ్, సూట్‌కేసూ వగైరా సామాన్లు పదే పదే చూసుకుంటూ అవస్థ పడుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సే అయినా మరీ పాసింజరులా వెళ్లటంల్లేదుగానీ ఎక్స్‌ప్రెస్‌లా మాత్రం లేదు. వేసవి ఎండలా ఉంది వాతావరణం.

కండక్టరు ఏదో చార్ట్‌మీద టిక్కట్టు నెంబర్లు నోట్ చేసుకుంటున్నాడు.

''అమ్మో నా పర్సు'' అన్న అరుపుకి బస్సులో జనం ఉలికిపడి ఆవైపు చూశారంతా.

వెనుకవైపు మూడో సీట్లో ఉన్న వ్యక్తి లేచి జేబు లెతుక్కుంటూ క్రిందా మీదా చూస్తుంటే ''ఏం జరిగిందండీ!'' అనడిగాడు కండక్టరు వెనక్కి తిరిగి.

''నాపర్సు కొట్టేశారెవరో.''

''పర్సా! కొట్టేశారా!'' ఒక్కసారిగా డజను కంఠాలు ఆశ్చర్యంగా, ఆదుర్దాగా అడిగాయి.

మగత నిద్రగాళ్ళూ, సగం నిద్రగాళ్ళూ ఉలికిపడి లేచేశారు.

''అన్నీ వెతికా. కనపట్లేదు.''

''అసలు బస్సెక్కేటప్పుడు ఉందా!'' ఎవరో అడిగారు.

''బస్సు ఎక్కేగదా నేను టిక్కట్టు తీసుకున్నాను.''

''చూడండి. చూడండి. ఎవరో పిక్‌పాకెట్ గాడు ఉండిఉంటాడు.''

''ఇందాకా బస్సు ఆపినప్పుడు సోడా కూడా త్రాగాను''

''అంటే ఆ తర్వాతే పోయిందన్నమాట.''

''నా ప్రక్కన ఈయన ఒక్కరే గా కూర్చున్నది.'' అని ఆ వ్యక్తి తన ప్రక్కన కూర్చున్న వ్యక్తి వైపు ముఖం చిట్లించుకుని చూశాడు.

'అవును సుమా' అన్నట్లు ప్రక్కవ్యక్తికేసి అంతా కళ్లు ఇంతచేసుకుని మరీ చూశారు.

అతను బిత్తరపోయేడు. ఎలాగో తేరుకుని అన్నాడు నెమ్మదిగా. ''మరోసారి జాగ్రత్తగా చూసుకోండి'' అని.

''ఏవిటి చూసుకునేది. అన్నీ చూసుకున్నాను. ఉంటే ఎందుకరుస్తాను. పెద్దమనిషిలా ప్రక్కన కూర్చుని పిక్‌పాకెట్ చెయ్యడం ఈ ఇడియట్స్ ప్రజ్ఞ.'' అన్నాడు పర్సుపోయిన ఆసామీ కోపంగా.

ఆ మాటకి ప్రక్కవాడికి కోపం వచ్చింది.

జనం అంతా జేబుదొంగల్ని వాళ్ల వాళ్ల పరిభాషల్లో ఇష్టంవచ్చినట్లు తిడుతున్నారు.

అమితాబ్ బచన్ స్టైల్లో క్రాఫింగు, నల్లద్దాల కళ్లజోడు, చేతిలో ఓ సినిమాపత్రిక, చిన్న హేండ్‌బ్యాగ్‌తో ఉన్న ఆ పర్సు పోగొట్టుకున్న వ్యక్తిపట్ల జనం సానుభూతులు, సలహాలు వగైరా వగైరాలతో కాలక్షేపం చేస్తున్నారు.

పర్సుపోయి నల్లద్దాల కళ్లజోడతను తన సీట్లో నిల్చుని, కూర్చుని, ప్రక్కన కూర్చున్న అతన్ని గుర్రుగా చూస్తూ,ఏవేవోమాట్లాడుతూ నానా హంగమా చేస్తున్నాడు.

అలా పావుగంట గడిచేసరికి ప్రక్కవాడిని దొంగగా తేల్చేశాడు నల్లద్దాల కళ్లజోడతను.

దానికితోడు ప్రక్కవాడు ఛామనఛాయ రంగులో, శుభ్రంగా నున్నటి గుండుతో, కాస్త మాసిన బట్టల్లో ఉండటం జేబుదొంగ అయ్యే అర్హత సంపాదించుకున్నట్లున్నాడు.

'తన పర్సు అతనే తీశాడని' అరుస్తూ మరీ చెప్పాడు కళ్లద్దాలవాలా.

''నేను తియ్యడమేమిటి! చూడకుండా మాట్లాడకండి. నేనూ ప్రభుత్వోద్యోగిని. దొంగతనం చెయ్యాల్సిన ఖర్మ నాకేంలేదు.'' ఎలాగో అన్నాడు గుండు ఆసామీ.

''అసలా మనిషి చూడండి ఎట్లా ఉన్నాడో. ఉద్యోగట. ఆ లక్షణాలున్నాయా.''

''ఇది బస్సు కాబట్టి సరిపోయింది. మంచి మాటలతో చెబుతున్నాం. అదే బయటయితే ఈపాటికి నాలుగు తన్నకుండా ఉండేవారా!''

''అసలు నా ప్రక్క కూర్చున్నప్పుడే అనుమానం వచ్చిందండీ. నే సోడా తాగినప్పుడు,

సిగరెట్ పెట్టి కొనుక్కున్నప్పుడూ పర్సు తీస్తే ఆశగా చూశాడు. దాంట్లో వందనోట్లున్నాయి.'' కళ్లద్దాలపర్సు పోయిన ఆసామీ అంటున్నాడు.

గుండు వ్యక్తికి ఏడుపొచ్చింది.

'తను వాడి పర్సు కొట్టెయ్యడమేమిటి ? పైగా వాడు చెబుతున్నవి శుద్ధ అబద్ధం. వాడు టిక్కట్టు తీసినప్పుడూ, సోడా త్రాగినప్పుడు పర్సు తీసినట్టు లేదు. జేబులోంచి ఇరవయ్యో, పదో కండక్టరికి ఇచ్చాడు సరికదా వాడసలే సిగరెట్టు పెట్టె కొనలేదు. పర్సు తీసి కండక్టర్‌కి డబ్బులిచ్చింది తను. కూల్‌డ్రింక్ తాగింది తను. సిగరెట్ పెట్టెకొన్నది తను. ద్రాక్షపళ్లు కొన్నది తను ... అసలు వాడికి పర్సు ఉందా ! తనను దొంగనుచేసి వాళ్లంతా...' అతను ఏడుపు ఆపుకోలేక జేబురుమాలుతో ముఖం తుడుచు కున్నాడు.

వాడి మాటే వింటున్నారు కానీ తనమాట వీళ్లు వినటల్లేదు.

''దిక్కులు చూడటం కాదు. మర్యాదగా పర్సు బయటకి తియ్యి.'' అని అతని కాలర్ పట్టుకున్నాడు కళ్లద్దాల వాలా.

''ఉండండి బస్సులో ఏవిటి గొడవ !'' అంటూ వచ్చిన కండక్టరు : ''ఏవయ్యా పక్కన కూర్చుని ఏం పనులయ్యా ఇవి.'' అని సర్ది చెబుతున్నాడు.

గుండు అతను ఏదో చెప్పబోతున్నా అతని మాట ఎవరూ వినిపించుకోటల్లేదు.

తలొకరు తలొక మాటగా ప్రపంచంలోని నీతి వాక్యాల నన్నింటినీ విసిరేస్తున్నారు.

కోటి విద్యలు...

చివరికి డ్రైవరుగారికి కోపం వచ్చి బస్సు టక్కున ఆపేశారు.

''ఏటి వీరాస్వామీ ఆ గొడవ. అరగంట బస్సాపేస్తాను అందరి జేబులూ చెక్ చేయించు దరిద్రం వదిలిపోద్ది.'' అని కండక్టర్‌ని ఉద్దేశించి అరిచాడు.

''నువ్వు సీట్లోంచి లే'' అన్నాడు గుండు వ్యక్తిని కళ్లద్దాల అతను.

''వెతకండి వెతకండి '' అంటున్నారు అంతా.

గుండు అతనికి బస్సులోంచి దూకి చద్దా మనిపించింది. ఏ ముహూర్తాన ఇంటి దగ్గర బయలుదేరాడో బస్సులో ఇలా పదిమంది ముందూ 'దొంగ'లా తలవంచాల్సి వచ్చినందుకు భరించరాని బాధ కలిగిందతనికి. పది మందికీ చేతులు జోడించి 'నేను దొంగని కాదు బాబూ' అని చెప్పాలనుకున్నాడు. కానీ తన మాట వినటల్లేదు వాళ్లు.

కళ్లద్దాల వాలా కోపంగా అతని వళ్లంతా సోదాచేస్తున్నాడు. వెతికినచోటనే మళ్లీ మళ్లీ వెతికాడు.

''ఏవిటీ దొరకలేదా'' అడిగాడు కండక్టరు.

''మా వెర్రిగానీ ఇంకేందొరుకుతుందండి. దొంగసొమ్ము తీసినట్లే ఉంటుందా, చేతులు మారదూ ! '' అన్నారెవరో.

కళ్లద్దాలతను చెయ్యెత్తాడు కొట్టడానికి. ఇంతలో డ్రైవరు అక్కడికొచ్చి అడ్డుకున్నాడు. ''అతని జేబులూ అన్నీ వెతికారు దొరకలేదు. బస్సులోమాత్రం ఘర్షణపడకండి. పావుగంట బస్సు ఆపుతాను అందర్నీ చెక్‌చేసుకుంటానంటే సరి, లేదా మద్రాసులో పోలీసుల కప్పగించి మీరూమీరూ తేల్చుకోండి.'' అన్నాడు.

''అందర్నీ చూసుకోమనండి, మా కేం అభ్యంతరంలేదు.'' అని ఓ స్త్రీ అన్నది.

తన దగ్గర దొంగసొమ్ము దొరకనందుకు అదే పదివేలనుకుని దేవుళ్లకి కోటిదండాలని కిక్కురుమనకుండా బిగుసుకుపోయి కూర్చున్నాడు గుండువాలా. సోదాచేయడంలో జేబురుమాలు, జేబులో కాగితాలు వగైరా గత్తర బిత్తరగా ఉన్నా సర్దుకోవడానిక్కూడా ప్రయత్నించలేదు, జేబులో చెయ్యి పెడితే వాళ్లకి అనుమానం వస్తుందని.

బస్ అంతా చెక్ చేశారు. ఎవరిదగ్గరా ఏమీ దొరకలేదు. తన సీట్లో కూర్చుని గట్టిగా అరుస్తూ తిట్టుకుంటున్నాడు కళ్ళద్దాల వాలా. 'ఎక్కడేనా పారేసుకున్నాడేమోలే'అని ఒకళ్లిద్దరు చిన్నగా అనుకున్నారు.

ముప్పావుగంటకి మద్రాసులో ఆగింది బస్సు. విసురుగా కళ్లద్దాల వాలా సీట్లోంచి లేచి బయటికి గుండు ఆసామీని తోసుకుని మరీ రాబోయాడు.

ముందుసీటు వెనకాల మేకో మరేదో కళ్లద్దాల ఆసామీ ఫేంటికి పట్టి జేబు చిరగడం జేబులో ఉన్న పరుసు క్రింద పడటం క్షణంలో జరిగిపోయింది.

''అది నా పర్సు'' అని ఒక్క గావుకేక పెట్టాడు దాన్ని చూడగానే గుండు వ్యక్తి.

బిలబిలాపోతున్న ప్రయాణీకులు గబుక్కున వెనక్కి చూశారు.

''నిజం ఆ పర్సు నాదే. అతని జేబులోంచి క్రింద పడింది. కావలిస్తే పరుసు చూడండి'' అనేశాడు గుండువాలా గుక్కతిప్పుకోకుండా.

ఎవరో వంగుని ఆ పర్సు తీసివిప్పిచూశారు. అందులో గుండువాలా ఫోటో, ఆ క్రింద వి. పరంధామ్, బి. ఏ., తర్వాత ఆఫీసు ఎడ్రసు హోదా ఉన్నాయి.

''నన్ను సోదా చేస్తున్నప్పుడు అతను కొట్టేసి ఉంటాడు.'' గబగబా అనేశాడు పరంధామ్ ఉరఫ్ గుండువాలా.

అప్పటికే గుమ్మం దగ్గరికి చేరుకున్న కళ్లద్దాలవాలా గబుక్కున క్రిందకి గెంతి మళ్లీ వెనక్కి చూడకుండా పరుగెత్తాడు.

పరంధామ్ ఊపిరి పీల్చుకున్నాడు. తన పరసు అందుకుని జేబులో వేసుకుని, సూట్‌కేస్ తీసుకుని దర్జాగా బస్సు దిగాడు. దిగుతూ అందర్నీ ఓసారి చూశాడు. తమ ముఖాలు ఎక్కడ పెట్టుకోవాలో తెలీక జేబురుమ్మాళ్లతో దాచుకున్నారు వాళ్లు.

అప్పటికి కాని మరో అయిదుగురి జేబులు ఖాళీ అయ్యాయన్న సంగతి వాళ్లకితెలీలేదు...★